# దంపినమ్మకు బొక్కిందే కూలీ

"చాలా లోకోక్తులు పోగుజేశావే నీరజా! అన్నీ అర్థమయే వ్రాసి వుంచావా?"

"వినోదం, విజ్ఞానం కలుగుతాయని సేకరించి వ్రాసుకున్నాను" నీరజ పుస్తకాలు సర్దివుంచి అన్నది.

"కొన్ని అసలే అర్థంగావు నాకు, అకాడమీవారు పబ్లిష్ చేసిన పుస్తకం చదివాను, కొన్ని నవ్వు తెప్పిస్తాయి గానీ, కొన్ని మోటుగా వుంటాయి, కొన్ని అతిశయోక్తిలాగా వుంటాయి, నేనూ సేకరించాలి, యెలా యేర్పడ్డాయి తెలియాలి"

"యెలా యేర్పడ్డాయో తెలుసుకోటం సులభం, కాని దానిలో దాగివున్న సత్యాన్ని గ్రహించాలి.

"అదీ నిజమేననుకో. 'దంపినమ్మకు బొక్కిందే కూలీ' అనేది సబబుగా లేదు, యెంత బొక్కగలదూ? మహా అయితే ఒక పావుకేజీ స్వాహా చేస్తుందేమో, కూలీయే యెక్కువడగాలి, అది మంచి పద్ధతి."

"ఇవ్వరనుకో, మొదటికే మోసం వస్తుంది, గ్రాసుక ఒప్పుకుంటుంది."

మోసమేముంటుందీ, నాలుగిళ్ళలో ఒప్పుకుంటుందిగా.

"ఇప్పుడు మిల్లూ, గ్రైండరూ వచ్చాక, దంపుడు అనేది దెబ్బ తిన్నట్టే లెక్క, నా చిన్నప్పుడు ఒక పాట విన్నా.

'బస్సు పుట్టిందోయ్ బాబూ, బస్సు పుట్టిందీ
బస్సుపుట్టి బళ్ళవాళ్ళ కడుపు కొట్టిందీ' అంటే దగ్గర

వూళ్ళ ప్రియాణాలకో బండి మాటాడుకునేవారు, నేను చదువు కుంటున్నప్పుడు జట్కావాడు తెల్లారుజామున 'ధవళేశ్వరం ఖాళీ!' అని అరుస్తూ బండి పరుగెత్తించేవాడు, చక్రం మీద చరణాకోల అనిస్తే టకటక చప్పుడై మెలకువ వచ్చేసేది, ఆ రాబడి పోయింది పాపం, అలాగే రెడీమేడ్ గార్మెంట్స్ కొల్ల లుగా షాపుల్లోకి చేరుతుంటే దర్జీలకు పనితగ్గి ఆదాయం తగ్గి పోతున్నది, జీవనభృతికి దారి చూచుకోవాలి.

అలా నీరజా, భారతీ మాట్లాడుతుండగా, పనిచేసిపెట్టే అమ్మాయి వచ్చింది.

గిన్నెలేశావా? విమ్మా సబ్బూ బూడిదా కలిపావా? అన్నీ జిడ్డు గిన్నెలే, నూనె తక్కువ వాడు, దొడ్డివేపు పరుగెత్తింది, అది గిన్నెలు తోమి బోర్లించే లోపల, దాని కొడుకు, ఆరేళ్ళ వాడొచ్చి కొళాయి తిప్పి స్నానం కానిచ్చి, చొక్కా లాగూ సబ్బుతో వుతుక్కొని తీసికెళ్ళాడు.

చీపిరేదీ? రా, రా, యిల్లు చిమ్మించుకో, మళ్లా యేదో కనబడలేదని మాన్పిస్తావు, నీరజ లేచింది, భారతి తాను చిమ్మించి వస్తానని వెళ్ళింది, నీరజ టీ చేయాలని వంటింట్లో కెళ్ళింది, ఇల్లు చిమ్మి తుడిచినంతసేపూ భారతిని యింటెట్ చేస్తూనే వున్నదమ్మాయి.

యెంతిస్తావూ? అన్నంలోకన్నీ కారంగా వండుతావా? నీరజా తినలేదుట, పిల్లలూ తినలేరంటుంది, అన్నీ చప్పగా వండుతాది, కుక్కకు పారేస్తా, రెండుపూటలా వస్తా, బిందెడు నీళ్ళిస్తావా?

నీరజ భారతిని పిలుచుకొద్దామని మెట్లెక్కి పైకి పోతుంటే, వని అమ్మాయి చెల్లెలూ తమ్ముడూ మేడమీదికి పాకి పెద్దదైన పెద్ద జాజిచెట్టు మొగ్గలు ఒడినిండా కోసి తెస్తు యెదురైనారు.

నీకెక్కవాలా గిరిజా! కాసినే గదా అని కోసినాను, పసరు మొగ్గలు తుంపకుండా కోసినాలే, అని రాని నవ్వు నవ్వుతూ కిందికెళ్ళిపోయారు.

ఇయాల కోవిలకెళ్ళాల, ఓ కొబ్బరికాయ యియ్యి, తల ముడేసుకుంటూ అడిగింది అమ్మాయి, నీరజ బోండాం తెచ్చి అక్కడుంచింది. తమ్ముడు వచ్చి, పెచ్చులు తీసి టెంకాయా పెచ్చులూ బుట్టలో వేసి తీసికెళ్ళాడు.

వెళ్ళిపోబోతూ, బాగా యెదిగి చిక్కనైన గోంగూరచెట్లు చూసింది అమ్మాయి. శాన్నాలైందే నీవు వండుకోవా? కొద్దిగా కోసుకోవా? అంటూనే ఒడినిండా గోంగూరా, తియ్యబచ్చలీ కోసింది.

నోరెండింది, ఐస్‌వాటర్ కావాలా. ఓ సీసా యియ్యి. సీసా కడిగివ్వటానికి వెళ్ళి, రాలిన గజనిమ్మ వళ్ళు రాలి పడినవి చూసింది, వాటినీ యేరి ఆకు మధ్య వుంచింది. నవ్వుతూ గేటువేపు వచ్చింది.

తలుపేసుకో, నీవు లోన యెక్కడో వుంటావు, గొడ్లొస్తాయి, సంపెంగ పూలకోసం మనుషులు చడీ చప్పుడూ కాకుండా వచ్చి లోన దూరుతారు. పలహా పారేసి వెళ్ళింది.

భారతి నవ్వుతూ వచ్చి బల్లముందు కూచున్నది, ఇద్దరూ టీ తాగి బిస్కట్లు తిన్నారు.

"నే వెళ్తా గిరిజా! గట్టిదే నీకు పనికి కుదిరినమ్మాయి, పిల్లలు యింటికి వచ్చి వుంటారీపాటికి" అని లేచింది. హాండ్ బాగ్ అందుకుని, తాళంచెవులకోసం, చిల్లరకోసం చూసింది.

"అన్నట్టూ, అగర్‌బత్తీ కొని తెచ్చి, డ్రాయింగ్ రూమ్‌లో పుస్తకాల షెల్ఫ్ మీదుంచి లోపలికి వచ్చా, నయమే గుర్తు వచ్చింది. మరిచిపోయి వెళ్ళిపోయేదాన్నే.

ఇద్దరూ డ్రాయింగ్ రూమ్‌లోకొచ్చి షెల్ఫ్‌మీద లేదు బత్తీ పెట్టె.

ఇక్కడే పెట్టానోయ్! పాన్‌షాపులో కొన్నా, నూర్పుంటా యన్నాడు, మంచి వాసన, బాగా గుర్తే, నోటిమీద వేళ్ళుంచుకున్నది, వెలవెల పోయింది, సంబాళించుకున్నది, విచారంగా చూసింది.

గిరిజ నవ్వు మొహం పెట్టి అన్నది.

"ఇప్పుడా సామెత బాగా అర్థమైందనుకుంటా, భారతీ!"

భారతీ నవ్వగలిగింది, కర్చీఫ్‌తో మొహం అద్దుకున్నది, ఇవాళ దంపినమ్మ చాలా బొక్కింది, యెంతలేదన్నా కనీసం యిరవై రూపాయలు స్వాహా, దాంతో యెలా వేగుతున్నా.

మార్చి మరొకామెను పెట్టుకున్నా, ఆమే యింతే, అని తెలిసి శక్తిమేరకు వేగుతున్నా. ఆ కాస్త సాయం గూడా వుండదేమోనని చూస్తా.

వస్తా గిరిజా, భారతి వెళ్ళిపోయింది.

గిరిజ తలుపేసుకున్నది.